సాక్షి ప్రకాశం

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



రైతుకష్టం వానపాలు

దర్శి మండలంలో ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కల్లాల్లో, ఇళ్ల ముందు ఉంచుకున్న ధాన్యం తడిసిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- 8లో..



టూరిస్టు బస్సును ఢీకొన్న కారు

శ్రీశైలం రహదారిలో నల్లవాగు వంతెన సమీపంలో టూరిస్టు బస్సును కారు వేగంగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మస్తాన్‌వలికి భారత్ బిజినెస్, స్మైబిజ్ అవార్డ్‌లు



మస్తాన్‌వలికి అవార్డు అందిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, భారత్ పే సీఈఓ అష్నీర్‌గ్రోవర్

తాళ్లూరు: ఢిల్లీ వేదికగా ఈ నెల 21న జరిగిన భారత్ బిజినెస్ 2024 అవార్డు, స్మైబిజ్ ఐకాన్ స్టార్ 2024 అవార్డులను తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి అందుకున్నారు. మస్తాన్‌వలి ప్రముఖ పారిశ్రామికవేత్త, భారత్ పే సీఈఓ అష్నీర్ గ్రోవర్ చేతుల మీదుగా శనివారం ఈ అవార్డులను అందుకున్నారు. మస్తాన్‌వలి మొదటిగా డెక్కన్ క్లాప్ పెయింటింగ్, వాటర్ ప్రూఫింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ స్థాపించారు. దేశంలో 16 ప్రధాన నగరాల్లో 30 వేల మంది ఇంటి యజమానులకు పెయింట్, వాటర్‌ప్రూఫింగ్ సంబంధిత సర్వీస్ అందిస్తున్నారు. ఈ విధానంపై ఇండియాలోని టాప్ 5 పెయింటింగ్, వాటర్ ప్రూఫింగ్ ట్రైనర్స్‌లో ఒకరిగా మస్తాన్‌వలిని గుర్తించి ఈ అవార్డులు ఇచ్చారు.

అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు ఒంగోలు లోని ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రం, స్కిల్ హబ్ సెంటర్‌లలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. శిక్షణ జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇతర పూర్తి వివరాలకు 9652282636 అనే నంబరుపై సంప్రదించాలన్నారు.

ఉచితం.. ఉత్తి గ్యాస్



మహిళలకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబు మాటలు ఉత్తి గ్యాసే అని తేలిపోయింది. బాబు మాటలు నమ్మి గ్యాస్ బుక్ చేసుకున్న వారిలో కొంత మందికే సబ్సిడీ డబ్బులు జమచేసి మిగిలిన వారికి మొండిచేయి చూపారు. జిల్లాలో సుమారు 4 లక్షల మంది అర్హులైన వారికి సబ్సిడీ నగదు అకౌంట్లలో జమకాలేదు. ఉచిత గ్యాస్ పేరుతో మమ్మల్ని మోసం చేశారని మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు.

- ఉచిత గ్యాస్ డబ్బులు పడక బ్యాంకుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- నవంబరులో బుక్ చేసిన గ్యాస్ సిలిండర్లకు ఇప్పటి వరకు డబ్బులు జమకాని వైనం
- ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక లబ్ధిదారుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మహిళలకు ఉచిత వంట గ్యాస్ పథకం ఆదిలోనే హంసపాదుగా మారింది. దీపావళి పండగ నుంచి గ్యాస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. నిజానికి ఇప్పటికే రెండు సిలిండర్లు ఇవ్వాలి కానీ నవంబర్ చివరి తేదీ వరకు మొదటి సిలిండర్‌కు డబ్బులు జమ చేస్తామని చెప్పారు. కొంతమంది లబ్ధిదారులకు మాత్రమే డబ్బులు జమ చేసి చేతులు దులుపుకున్నారు. నవంబర్ చివరి తేదీ లోపు గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నా నేటికి 20 రోజులు కావస్తున్నా అతీగతీ లేదు. ఏ రోజుకారోజు సెల్‌ఫోన్‌లో మెసేజ్ వస్తుందేమో అని చూసుకోవడం, చిల్లిగవ్వ కూడా పడకపోవడంతో నిరాశగా కూటమి పాలకులను తిట్టుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 6,56,738 కనెక్షన్లు...

జిల్లాలో మొత్తం 6,56,738 కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ఇండియన్ గ్యాస్ కంపెనీకి 26 ఏజెన్సీలు ఉన్నాయి. జనరల్ సిలిండర్లు 2,01,758, దీపం 80,876, సీఎస్‌ఆర్ కనెక్షన్లు 13,941, ఉజ్వల కనెక్షన్లు 8156, పీఎంయూవై కనెక్షన్లు 4023, మొత్తం గృహావసరాలకు సంబంధించి 3,08,754 కనెక్షన్లు ఉండగా 1960 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. హెచ్‌పీ కంపెనీకి సంబంధించి జిల్లాలో 10 ఏజెన్సీలు ఉన్నాయి. వాటిలో జనరల్ 1,02,458, దీపం కనెక్షన్లు 3,67,76, సీఎస్‌ఆర్ కనెక్షన్లు 1725, ఉజ్వల కనెక్షన్లు 3208, పీఎంయూవై కనెక్షన్లు 1605 మొత్తం మీద 1,45,772 కనెక్షన్లు ఉండగా 1462 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. భారత్ పెట్రోలియం కంపెనీకి 13 ఏజెన్సీస్ ఉన్నాయి. 1,26,884 జనరల్ కనెక్షన్లు ఉండగా దీపం కనెక్షన్లు 43,974 ఉన్నాయి. సీఎస్‌ఆర్ 22,851 కనెక్షన్లు, ఉజ్వల 5,391 కనెక్షన్లు, పీఎంయూవై 3,112 మొత్తం కలుపుకొని 2,02,212 కనెక్షన్లు ఉన్నాయి. హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీకి 10 ఏజెన్సీలు ఉన్నాయి. 1,02,458 జనరల్ కనెక్షన్లు ఉండగా దీపం పథకం కింద 36,776 కనెక్షన్లు, సీఎస్‌ఆర్ కనెక్షన్లు 1725, ఉజ్వల కనెక్షన్లు 3208, పీఎంయూవై కనెక్షన్లు 1605 మొత్తం కలిపి 1,45,772 కనెక్షన్లు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు మరో 1462 ఉన్నాయి. ఇదిలా ఉండగా ఒంగోలు నగరంలో ఇండియన్ గ్యాస్‌కు 63,108 కనెక్షన్లు, హెచ్‌పీ గ్యాస్‌కు 53,038 కనెక్షన్లు మొత్తం కలిపి 1,16,146 కనెక్షన్లు ఉన్నాయి.

సగానికి సగం మందికి మొండిచేయి...

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 6,56,738 ఉన్నాయి. ప్రభుత్వం ఈ ఏడాదికిగాను కేవలం రూ.20,93,11,842 మాత్రమే మంజూరు చేసింది. ఇప్పటి వరకు సుమారు 2,51,659 మందికి రూ.20,43,45,882 చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్క ప్రకారం చూసినా జిల్లాలో ఇంకా 4,05,079 మందికి ఉచిత సిలిండర్లకు సబ్సిడీని విడుదల చేయాల్సి ఉంది. దీనికి నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు కూడా ఈ విషయంలో ఏమీ చెప్పలేక పోతున్నారు. పాలకులు మాత్రం అందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటోంది. గ్యాస్ డెలివరీ చేసిన 48 గంటల్లోపు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకులో జమవుతాయని చెప్పారు. కానీ నవంబర్ లోపు గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 23 రోజులు గడుస్తున్నా వేలాది మంది లబ్ధిదారులకు డబ్బులు జమ కాలేదు.

జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు: 6,56,738 కనెక్షన్లు

ఇప్పటి వరకు సబ్సిడీ చెల్లించిన గ్యాస్ కనెక్షన్లు: 2,51,659

ఇంకా సబ్సిడీ నగదు రావాల్సిన కనెక్షన్లు: 4,05,079

బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు



ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇస్తుందని చెబితే నమ్మి గ్యాస్ బుక్ చేశాను. రోజులు గడుస్తున్నా డబ్బులు మాత్రం బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను అడిగితే మాకు తెలియదు అంటున్నారు. మీ అకౌంట్లోనే డబ్బులు పడతాయని చెబుతున్నారు. రెండు సార్లు బ్యాంకు దగ్గరకు వెళ్లి అడిగాను. డబ్బులు పడలేదని చెప్పారు. ఇబ్బందులు పెట్టకుండా గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన వెంటనే డబ్బులు పడితే బాగుంటుంది.

– షేక్ మహబూబ్ బాషా, ట్రాక్టర్ డ్రైవర్, కంభం.

ఇంకా డబ్బులు పడలేదు



డబ్బులు చెల్లించి గ్యాస్ సిలిండర్ తీసుకున్నాను. మరుసటి రోజు గ్యాస్ డబ్బులు బ్యాంకులో పడతాయని చెప్పారు. కానీ ఇంతవరకు పడలేదు. ఎవరిని అడగాలో తెలియడం లేదు. ఎవరిని అడిగినా నాలుగు రోజులు ఆగండి అంటున్నారు. లేకపోతే అధికారులను అడగండి అని చెబుతున్నారు. ఇంతకూ ఏ అధికారిని అడగాలి. ఏ ఆఫీసుకు పోవాలో తెలియడం లేదు.

– సుబ్బులు, మర్రిపూడి

పనిచేయని 1967 టోల్ ఫ్రీ...

ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించి ఏదైనా సమస్యలుంటే 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని ప్రభుత్వం చెప్పింది. అయితే ఈ నంబరుకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా ప్రయోజనం ఉండడం లేదు. దాంతో జిల్లా పౌరసరఫరాల కార్యాలయం వద్దకు వెళ్లి అడగమని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. అక్కడకు వెళితే లోపలకు రానివ్వడం లేదని సామాన్యులు ఘొల్లుమంటున్నారు. దీంతో ఉచిత గ్యాస్ పథకం చంద్రబాబు మాయగా ప్రజలు విమర్శిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇలా ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

ఫిర్యాదు ఎవరికి చేయాలి...

ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం డబ్బులు బ్యాంకుల్లో పడకపోవడంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. దాంతో అధికారులు వారికి సమాధానం చెప్పలేక విసుక్కుంటున్నారు. మాకు సంబంధం లేదని చెబుతున్నారు. దాంతో ఏజెన్సీల దగ్గరకు పోతే ఈకేవైసీ చేయించారా లేదా చూసుకోండి అనే సమాధానం వినిపిస్తోంది. ఈకేవైసీ చేయించిన వారికి కూడా సబ్సిడీ డబ్బులు పడడంలేదని చెబుతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక లబ్ధిదారులు సతమతమవుతున్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అయితే ఇదంతా వలంటీర్లు చూసుకునేవారు. ఎలాంటి సమస్య వచ్చినా వారి దృష్టికి తీసుకెళితే చాలు చిటికెలో పనిచేసి పెట్టేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. సచివాలయం దగ్గరకు వెళ్లినా అక్కడ కూడా జవాబు చెప్పేవారుండడం లేదు.



ఇసుక మాఫియా పది అడుగులకు పైగా ఇసుకను తవ్వడంతో బయటపడిన నీళ్లు



పోలీసులు పట్టుకోకుండా వదిలేసిన లారీ ఇదే

పాలేరును తోడేస్తున్నారు

- పాలేరులో ఆగని టీడీపీ నేతల అక్రమ ఇసుక రవాణా
- వేంపాడు సమీపంలోని పాలేరును సందర్శించిన మైనింగ్ అధికారులు
- మైనింగ్ అధికారుల సూచనలతో టిప్పర్లు, లారీలను అడ్డుకున్న గ్రామస్తులు
- బడా నేతల ఆదేశాలతో రంగంలోకి దిగిన పొన్నలూరు పోలీసులు
- అక్రమ ఇసుకను అడ్డుకుంటే కేసులు పెడతామంటూ బెదిరింపులు
- టిప్పర్లు, లారీలను అడ్డుకున్న గ్రామస్తులను పోలీస్‌స్టేషన్‌కు రావాలని హుకుం



అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులపై కేసులు పెడుతామని బెదిరిస్తున్న పోలీసులు



పాలేరులో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటున్న వేంపాడు గ్రామస్తులు

పొన్నలూరు: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలకు అండగా నిలవాల్సిన పోలీసులు అధికార పార్టీ నేతలకు సలాం కొడుతూ వారు చెప్పిందే వేదంగా గ్రామాల్లో జరుగుతున్న అక్రమాలకు, అవినీతి పనులకు కొమ్ము కాస్తున్నారు. పొన్నలూరు మండలం వేంపాడు గ్రామానికి సమీపంలోని పాలేరులో నాలుగు నెలలుగా అనధికారికంగా ఉచిత ఇసుక పేరుతో వేంపాడు, జరుగుమల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకులు టిప్పర్లు, లారీలు, పెద్ద పెద్ద వాహనాలతో ఇసుక తరలిస్తూ అక్రమ ఇసుక దందాకు తెరలేపారు. ఈ దందా అంతా నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బడా నేతల కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం. ఆ నేతల అండదండలు చూసుకొని స్థానికంగా ఇద్దరు టీడీపీ నేతలు ప్రతి రోజూ పదుల సంఖ్యలో టిప్పర్లు, లారీలు, పెద్ద పెద్ద వాహనాలతో ఇసుక తరలించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇందులో వచ్చే 80 శాతం వాటాను నియోజకవర్గ బడానేతలకు చేరుతుండగా, మిగిలిన 20 శాతం ఇసుకు దందా పర్యవేక్షకులు మింగేస్తున్నట్లు సమాచారం.

రాజీ కుదిర్చిన మంత్రి స్వామి...

వాస్తవంగా పాలేరు నుంచి స్థానికులు వారి గృహావసరాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకెళ్లవచ్చు. అయితే ఇసుక దందా సాగిస్తున్న టీడీపీ నేతల ఆధ్వర్యంలో పాలేరులో రెండు పొక్లెయిన్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి రోజు ఇసుక కోసం పాలేరుకు వచ్చే వినియోగదారుడు టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన పొక్లెయిన్ దగ్గర మాత్రమే ట్రక్కుకు రూ.1000 చెల్లించి ఇసుక నింపించుకోవాలి. లేకపోతే ఇసుకను తీసుకెళ్లనివ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో వారం రోజుల కిందట పొన్నలూరు వచ్చిన మంత్రి స్వామిని టీడీపీ సానుభూతిపరులే ఈ విషయంపై నిలదీశారు. కూలీలతో ట్రాక్టర్‌కు ఇసుక నింపిస్తే రూ.500 మాత్రమేనని, కానీ కొందరూ మన పార్టీ వారే మాఫియాగా ఏర్పడి... వారు ఏర్పాటు చేసిన పొక్లెయిన్ల ద్వారానే ఇసుక నింపించుకోవాలని అందుకు రూ.1000 వసూలు చేస్తున్నారని మంత్రి స్వామిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఖంగుతిన్న మంత్రి స్థానిక ఎస్సైని పిలిచి ఈ విషయాన్ని రాజీ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈక్రమంలో ఎస్సై పాలేరులో పొక్లెయిన్లు ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్న వ్యక్తులకు, టీడీపీ సానుభూతి పరులైన ట్రాక్టర్ యజమానులకు మధ్య రాజీ కుదుర్చి రూ.500 లకే ఇసుకను నింపేలా మాట్లాడినట్లు ట్రాక్టర్ యజమానులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. మొత్తంగా అక్రమ ఇసుక రవాణాల్లో పోలీసులు తీరు వివాదాస్పదంగా ఉందని వేంపాడు గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు...

ఇదిఇలా ఉంటే ఆదివారం తెల్లవారుజామున మళ్లీ అక్రమార్కులు టిప్పర్లు, లారీలతో ఇసుక తరలించడం గమనించిన గ్రామస్తులు మైనింగ్ అధికారుల సూచనలు మేరకు అడ్డుకున్నారు. దీంతో కొంత సేపు గ్రామస్తులు, అక్రమార్కులకు మధ్య గొడవ జరిగింది. ఎంతసేపైనా టిప్పర్లు, లారీలను గ్రామస్తులు ముందుకు పోనివ్వకపోవడంతో బడా నేతల ఆదేశాల మేరకు పొన్నలూరు పోలీసులు రంగప్రవేశం చేశారు.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అధికారపార్టీ నాయకులు పాలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జేసీబీలను ఏర్పాటు చేసి టిప్పర్లు, లారీలతో పక్క మండలాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. మైనింగ్ అధికారుల సూచన మేరకు ఇసుక రవాణాను అడ్డుకుంటుంటే పోలీసులు వచ్చి అడ్డుకున్న వారిపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి.

– దాసరి రవి, వేంపాడు గ్రామం

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. ఇసుక తరలించే విషయంలో గ్రూపులుగా ఏర్పడి గొడవలకు దిగితే కేసులు పెడతామని చెప్పాము తప్పా ఎవరిపై అక్రమంగా కేసులు పెడతామని బెదిరించలేదు. వ్యాపారంగా టిప్పర్లు, లారీలతో ఇసుకను తరలిస్తే చట్ట పరమైన కేసులు పెడతాం. గృహావసరాలకు మాత్రమే స్థానికులు ఇసుకను తీసుకెళ్లవచ్చు. దీనిపై ప్రజలు సహకరించాలి.

– అనుక్, ఎస్సై పొన్నలూరు

పాలేరును సందర్శించిన మైనింగ్ అధికారులు...

అక్రమ ఇసుక రవాణాపై 'సాక్షి' పత్రికలో కథనాలు రావడంతో పాటు పాలేరు నదీ పరివాహక గ్రామాల ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో మార్కాపురం మైనింగ్ అధికారులు వేంపాడు సమీపంలోని పాలేరును శనివారం సందర్శించారు. అయితే దీనిపై సమాచారం అందుకున్న అక్రమార్కులు ఆరోజు ఎలాంటి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడకుండా మిన్నకుండిపోయారు. మైనింగ్ అధికారులు అక్కడ ఇసుక తరలించడం వలన ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు, టిప్పర్లు, లారీల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన రహదారిని పరిశీలించి ప్రతి రోజూ భారీ స్థాయిలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు ఉన్నతాధికారులకు తెలియజేశారు. అలాగే గ్రామ సర్పంచ్‌ని, గ్రామస్తులను పిలిచి మాట్లాడారు. పాలేరు నుంచి ఇసుక తరలించడానికి ఎలాంటి అనుమతి లేదని, అయితే స్థానికులు తమ గృహ అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లవచ్చని వివరించారు. టిప్పర్లు, లారీలు ద్వారా ఇసుకను తరలిస్తే అడ్డుకొని అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించి వెళ్లిపోయారు.

లారీలను పట్టుకోకుండా వదిలేసిన పోలీసులు...

పాలేరుకు చేరుకున్న పోలీసులు ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, లారీలను పట్టుకోకుండా వాటిని వదిలేసి అక్కడ నుంచి పంపించి వేశారు. దీంతో గ్రామస్తులు పోలీసుల తీరుకు విస్తుపోయి నిరసనకు దిగారు. అక్రమ ఇసుక తరలిస్తున్న టిప్పర్లను, లారీలను అడ్డుకుంటే మీ మీదా కేసులు పెడతామని.. లారీలను అడ్డుకోకుండా ఇక్కడ నుంచి వెళ్లిపోండంటూ పోలీసులు గ్రామస్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిమ్మల్ని సీఐ, ఎస్సై పోలీస్‌స్టేషన్‌కు రమ్మన్నారంటూ బెదిరించారు. అయితే మైనింగ్ అధికారులు చెప్పారని అక్రమ ఇసుక రవాణాను మీరు ఎలా ప్రోత్సహిస్తారంటూ గ్రామస్తులు పోలీసులను ప్రశ్నించారు. ఇసుక లారీలు, టిప్పర్లను అడ్డుకున్నందుకు సీఐ, ఎస్సై మీ మీద కోపంగా ఉన్నారని అనవసరంగా కేసులు పెట్టించుకుంటారని, కేసులు పెట్టకముందే ఇక్కడ నుంచి వెళ్లిపోండంటూ పోలీసులు ఆదేశించారు.

రెడ్‌క్రాస్‌నూ వదలని పచ్చ రాజకీయం

- పాలకవర్గాన్ని సొంతం చేసుకునేందుకు టీడీపీ నేతల కుయుక్తులు
- హైకోర్టు తీర్పుతో భంగపాటు



ఒంగోలు టౌన్: విశ్వసనీయతకు..నిస్పక్షపాత సేవలకు మరోపేరు రెడ్‌క్రాస్. ఆపత్కాలంలో ఆదుకునే ఆత్మబంధువు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఎంతో మంది బాధితులకు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థ పేరు వింటే చాలు ఎలాంటి వారైనా సరే గౌరవిస్తారు. అలాంటి రెడ్‌క్రాస్‌లో పచ్చ రాజకీయం జోక్యం చేసుకోవడం జిల్లాలో తీవ్ర విమర్శకు దారి తీసింది. పక్కా ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసే రెడ్ క్రాస్ నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికార పార్టీకి అండగా నిలిచే వారి అవగాహన లోపంతో చిచ్చుపెట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రెడ్‌క్రాస్‌లో ఆధిపత్యం చెలాయించేందుకు కుట్రలు చేసి భంగపడ్డారు. రెడ్‌క్రాస్ కమిటీ చేత రాజీనామా చేయించి టీడీపీకి చెందిన వారిని నియమించేందుకు చేసిన కుయుక్తులు న్యాయస్థానం తీర్పుతో మూలనపడ్డాయి.

ఇంతకూ ఏం జరిగిందంటే...

ఒంగోలు రెడ్‌క్రాస్‌కు 2020లో పాలకవర్గ ఎన్నికలు జరిగాయి. చైర్మన్‌గా విద్యావేత్త ప్రకాష్ బాబు, వైస్ చైర్మన్‌గా డాక్టర్ చిట్యాల వెంటేశ్వరరెడ్డి, కోశాధికారిగా రాఘవతో పాటు మరో 13 సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడేళ్ల తరువాత పాలక వర్గం కాల పరిమితి అయిపోవడంతో తిరిగి 2023 మార్చిలో అదే కమిటీని ఎన్నుకున్నారు. ఈసారి 14 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీకి 2026 వరకు సమయం ఉంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో కమిటీని మార్చాలన్న ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రస్తుత కమిటీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎన్నికైంది కనుక ఇందులో పనిచేసే వారంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే అనే ముద్ర వేసిన కొందరు పచ్చ మేధావులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కమిటీ చైర్మన్ రాజీనామా చేస్తే మొత్తం కమిటీ రద్దవుతుందని, అప్పుడు మనవాళ్లను నియమించుకోవచ్చని సలహా ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. తద్వారా కమిటీ చేత రాజీనామా చేయించేందుకు తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక చైర్మన్ ప్రకాష్ బాబుతో సహా 8 మంది సభ్యులు అక్టోబర్ 17వ తేదీ కలెక్టర్‌కు రాజీనామా సమర్పించారు. మరో ఐదుగురు మాత్రం రాజీనామా చేయకుండా కొనసాగుతున్నారు. ఆ ఐదుగురు కలిసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. దాంతో డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి చైర్మన్ అయ్యారు.

రెడ్ క్రాస్ కమిటీ ఎన్నికలపై హైకోర్టు స్టే...

కమిటీలోని 8 మంది రాజీనామాలను ఆమోదించిన రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ అయిన కలెక్టర్ తమీమ్ అన్సారియా స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. డిసెంబర్ 22వ తేదీ రెడ్‌క్రాస్ ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులు చెల్లవంటూ చైర్మన్‌గా ఎంపికైనా చిట్యాల వెంకటేశ్వరరెడ్డి కోర్టుకు వెళ్లారు. కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. దీంతో 8 మంది రాజీనామాలు కూడా రద్దయ్యాయి. పాత కమిటీ కొనసాగినట్లేనని చెప్పవచ్చు.

ఈ ఒత్తిళ్ల వెనక ఉన్నదెవరు?

ఈ పరిణామాలు అధికారపార్టీకి చెంపపెట్టు అని చెప్పవచ్చు. అయితే ఈ రాజకీయాల వెనక ఉన్నదెవరన్న దానిమీద పలు చర్చలు జరుగుతున్నాయి. జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఒక హెచ్‌ఓడీ ఈ కథంతా నడిపినట్లు తెలుస్తోంది. రెడ్‌క్రాస్‌లో ఉన్న డా.చిట్యాల వెంకటేశ్వరరెడ్డితో ఉన్న వ్యక్తిగత స్పర్ధలతో రెడ్‌క్రాస్ కమిటీకి పొగపెట్టాలని, తద్వారా చిట్యాలను దెబ్బతీయాలని ఆయన పథకం వేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలను ఎమ్మెల్యే దామచర్ల దగ్గర దాచిపుంచి ఆయనను తప్పుదోవ పట్టించినట్లు జీజీహెచ్‌కి చెందిన పలువురు వైద్యులు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా రెడ్‌క్రాస్ నిబంధనలపై అవగాహనలేని సదరు హెచ్‌వోడీ ఎన్నికలతో నిమిత్తం లేకుండా 14 మంది పేర్లను తయారు చేసి దామచర్లకు ఇచ్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. తీరా హైకోర్టు తీర్పు వచ్చాక అసలు నిజం తెలిసిన ఎమ్మెల్యే దామచర్ల సదరు హెచ్‌ఓడీ మీద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

రాజకీయాలకతీతంగా సేవలు...

రెడ్‌క్రాస్‌కు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. ఒంగోలు రెడ్‌క్రాస్‌లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన సానుభూతిపరులున్నారు. వీరంతా ఏ పార్టీకి చెందిన వారైనా నాలుగేళ్లపాటు రాజకీయాలకతీతంగా సేవలందించారు. ఒంగోలు రెడ్‌క్రాస్‌ను రాష్ట్రంలోనే అగ్రపథంలో నిలిపారు. కరోనా సమయంలో ఈ కమిటీ అందించిన సేవలు ప్రశంసలందుకున్నాయి. అయినా ఈ కమిటీ మీద రాజకీయాల ముద్ర వేయడంపై వైద్య వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

జాతీయ స్థాయి ఎయిర్ పిస్టల్‌లో ప్రణవికి రెండు రజతాలు



కోచ్ సీకే చౌదరితో ప్రణవి

కొత్తపట్నం: ఢిల్లీలో ఈ నెల 21న జరిగిన జాతీయ షూటింగ్ చాంపియన్ షిప్‌లో కొత్తపట్నం మండలం రంగాయపాలెం గ్రామ పంచాయతీ వలసపాలేనికి చెందిన ద్వారం ప్రణవి, గుంటూరు జిల్లాకు చెందిన ముకేష్ జోడీ రెండు రజత పతకాలు సొంతం చేసుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగం సీనియర్, జూనియర్ కేటగిరీలో ప్రణవి, ముకేష్ జోడీ రెండో స్థానంలో నిలిచారు. సీనియర్ విభాగంలో ప్రణవి–ముకేష్ ద్వయం 577 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. జూనియర్ విభాగంలో ఈ జోడీ 576 పాయింట్లతో రజితంలో మెరిసింది. ఇద్దరు కలిసి ఆంధ్రకు మంచి పేరు తెచ్చారు. ఇంతకు ముందు ప్రణవి అనేక స్వర్ణ పతకాలు సాధించింది. సీకే చౌదరి కోచ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రణవి తండ్రి ద్వారం జాలిరెడ్డి, డీవీ రెడ్డి అభినందించారు.

క్లుప్తంగా

సెమీ క్రిస్మస్ వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్


కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: స్థానిక ఎస్‌ఎస్‌పీ కాలనీలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. కేక్‌ను కట్‌చేసి భక్తులతో భక్తిగీతాలను ఆలపించారు. క్రిస్మస్ పండగ సందర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ తప్పెట బాబూరావు, జె.యాకోబు, చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో నిలిచిన లారీ

● పెద్ద ఎత్తున నిలిచిపోయిన ట్రాఫిక్

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట నల్లమల ఘాట్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో వాహనాలు వెళ్లే వీల్లేక ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వివరాల్లోకి వెళితే..గిద్దలూరు నుంచి నంద్యాల వైపుగా వెళుతున్న జామాయిల్ కర్రల లోడు లారీ యాక్సిస్ ప్రమాదవశాత్తు విరిగిపోవడంతో లారీ రోడ్డుకు అడ్డంగా ఉండిపోయింది. పాత రైల్వేబ్రిడ్జి ఎక్స్ మలుపు రోడ్డు వద్ద ప్రమాదం సంభవించింది. దీంతో పెద్ద పెద్ద వాహనాలు అటుగా వెళ్లలేకపోయాయి. కేవలం ద్విచక్రవాహనాలు, చిన్నపాటి కార్లు మాత్రమే వెళ్లాయి. లారీలు, బస్సులు ఆ మార్గం మీదుగా వెళ్లలేక రోడ్డుపై నిలిచిపోయాయి. దీంతో నంద్యాల నుంచి గిద్దలూరుకు వచ్చే వాహనాల రాకపోకలు రోడ్డుపై పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న గిద్దలూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీ పనులు వేగవంతంగా పూర్తి చేయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

యర్రగొండపాలెం: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని గుర్రపుశాలలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సింగారపు సంజీవయ్య అక్కాచెల్లెళ్లు పెద్ద కోటమ్మ, చిన్న కోటమ్మలను వివాహం చేసుకున్నాడు. వారిలో పెద్ద కోటమ్మ కుమారుడు చెన్నయ్య శనివారం యర్రగొండపాలెంలో పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై తీసుకువచ్చాడు. పనులు పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలుదేరుతున్న సమయంలో చిన్న కోటమ్మ(56) వాహనంపై నుంచి జారి కిందపడి మృతి చెందిందని సంజీవయ్య, పెద్దకోటమ్మ తెలిపారని తెలిపారు. అయితే మృతి చెందిన కోటమ్మ శరీరంపై ఎటువంటి గాయాలు కనిపించకపోవడంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనంపై నుంచి కిందపడినా ఆమెకు గాయాలు కాకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. సంతానం లేని చిన్న కోటమ్మ బ్యాంకు ఖాతాలో పెద్ద మొత్తంలో నగదు ఉన్నాయని, చంద్రన్న బీమాతో పాటు జనరల్ ఇన్సూరెన్స్ కూడా ఉన్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకొనిపోయిన సంజీవయ్య డబ్బుల కోసం చిన్న కోటమ్మను హత్య చేసి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన తెలిసిన వెంటనే సీఐ ప్రభాకరరావు, ఎస్సై చౌడయ్య మృతదేహాన్ని పరిశీలించారు. కేసును అనుమానస్పద మృతిగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం చిన్న కోటమ్మ మృతదేహాన్ని ఒంగోలులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఒంగోలు టౌన్: హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వల్ల ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ప్రాణాలను కాపాడుతుందని ట్రాఫిక్ సీఐ పాండురంగారావు అన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా ఆదివారం నగరంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు కావడం వల్లనే ఎక్కువ మంది ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. దాని వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఎంతో మంది చిన్నారులు అనాథలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ద్విచక్రవాహనాలు నడిపేవారు తమ కుటుంబాల గురించి ఆలోచన చేయాలని, తమ కోసం ఇంట్లో భార్యాబిడ్డలు, తలిదండ్రులు ఎదురు చూస్తున్నారన్న విషయం మరిచి పోకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతి వేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ రైడింగ్ చేయవద్దన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడిపితే ఎంవీ యాక్ట్ ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ర్యాలీలో ట్రాఫిక్ పోలీసులు , సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు కష్టం వానపాలు


గణేశ్వరపాడులో కల్లంలో తడిసిన ధాన్యం


తడిసిన ధాన్యం ఆరబోసిన దృశ్యం

● ఆదివారం తెల్లవారు జామున మోస్తరు వర్షం
● వర్షానికి తడిసిన ధాన్యం
● కల్లాల్లో తడిసిన కుప్పలు
● వెంటనే ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఈ దుస్థితి ఉండదని ఆవేదన

దర్శి: రైతుల కష్టం వానపాలైంది. మండలంలోని ఎర్రోబనపల్లి, గణేశ్వరపురం, లంకోజనపల్లి, కొత్త వెంకటాపురం, కొత్తరెడ్డి పాలెం ఇంకా పలు గ్రామాల్లో కోసిన ధాన్యం ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి తడిసింది. రాత్రి పూట ఇంటి వద్ద ఆరబోసుకున్న ధాన్యం కూడా అకస్మాత్తుగా వర్షం రావడంతో గాలికి పట్టలు లేచిపోయి ధాన్యం బస్తాలు, ధాన్యం తడిసిపోయాయి. అందరూ ఇళ్లలో నిద్ర పోతున్న సమయంలో తెల్లవారు జామున రెండు నుంచి మూడు గంటల సమయంలో వర్షం రావడంతో ఈ భారీ నష్టం సంభవించింది. వర్షం రావడం గమనించిన రైతులు తమ ధాన్యం పై ఎగిరి పోయిన పట్టలు కప్పుకుంటూ మిగతా వారిని అప్రమత్తం చేసే లోపే ఒక్క సారిగా వచ్చిన వర్షం రైతులను నష్టాలు పాలు చేసింది. దీంతో ధాన్యం ఆరబోసుకుని ఎండబెట్టుకుంటున్నారు. మండలంలో ఖరీఫ్‌లో 2340 హెక్టార్లు, రబీలో 2500 హెక్టార్లలో వరిసాగు చేశారు. రబీలో వేసిన పంట కోతకు రావాల్సి ఉండగా, ఖరీఫ్‌లో సాగు చేసిన పంటను ఇప్పటికే కోసి కొంత కుప్పలు వేసి, మరికొంత ఇళ్లకు తెచ్చుకున్నారు. ఈ వర్షానికి దాదాపు 500 హెక్టార్లలో కోసిన ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు.

గత ప్రభుత్వం హయాంలో తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసి రైతులు నష్టాల పాలు కాకుండా ఆదుకున్నారు. గ్రామాల్లోనే ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. కొనుగోలు చేసే ధాన్యం తేమ శాతం చూసి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో కొందరు రైతులు నష్టాలకు దళారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు నామమాత్రంగానే జరుగుతోంది. పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేయకపోవడం వల్లే ధాన్యం ఇంటివద్ద పెట్టుకోవాల్సి వస్తోందని రైతులు చెప్తున్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

వానరాదనుకుని ఆరబెట్టాం



తెల్లవారు జామున అకస్మాత్తుగా వాన వచ్చింది. పది బస్తాల వరకు ధాన్యం తడిసిపోయాయి. నిన్న ఎండ ఉండటంతో వర్షం రాదని ఇంట్లో ఉన్నాం. వాన వచ్చిందని తేరుకునే సరికి ధాన్యం తడిసిపోయాయి. ధాన్యం తడిసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– పాలం చౌడిరెడ్డి, ఎర్రోబనపల్లి

కార్యకర్తల నిర్ణయాలతోనే కమిటీల ఏర్పాటు


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

● వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ నూతన కమిటీల నియామకాలు కార్యకర్తల నిర్ణయాలతోనే జరుగుతాయని, ఏకపక్షంగా నాయకుడి ఎంపిక ఉండదని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలకు చెందిన కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమాలు చేపట్టే సత్తా ఉన్న వారికే ఆయా మండలాలకు నాయకత్వం వహించే అర్హత కల్పిస్తామని చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో చర్చించి ఆమోదయోగ్యమైన వ్యక్తిని మండలాధ్యక్షునిగా నియమిస్తామన్నారు. మండలానికి నాయకత్వం వహించేందుకు ఎటువంటి అర్హత ఉందో ముందుగా సమావేశంలో చెప్పాలని, ఆ తరువాత పోటీపడుతున్న నాయకుల గురించి విడివిడిగా కార్యకర్తల అభిప్రాయాలను తాను సేకరించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఉన్న వ్యక్తిగత వర్గవిభేదాలు విడనాడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇష్టపడి పార్టీ కోసం కష్టపడేవారే నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, ప్రజల కోసం పోరాడేందుకు ఎంత దూరమైనా వెళతానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయించి ప్రజలకు అందుబాటులో తీసుకొని వచ్చేందుకు గ్రామ గ్రామాల నుంచి ఉద్యమాలు చేపట్టే సమయం ఆసన్నమైందన్నారు. ఇప్పటికే రైతుల కోసం ఉద్యమం చేశామన్నారు. త్వరలో విద్యుత్ పెంపు, రేషన్ మాఫియాను అరికట్టడం, మద్యం బెల్ట్ షాపుల నుంచి పల్లెలను రక్షించేందుకు కార్యకర్తలు ముందుకు రావాలని, వారిని ఉద్యమ బాటలో నడిపించటానికి నాయకులు తమ సమయాన్ని కేటాయించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు మన నాయకుడు జగనన్న ఇచ్చే ప్రతి పిలుపుకు నాయకులు స్పందించాల్సి ఉంటుందన్నారు.

జనవరి నుంచి తామంతా ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఆయా మండలాల సమావేశాల్లో పెద్దారవీడు మండలానికి చెందిన ఎంపీపీ బెజవాడ గురవయ్య, జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాలిరెడ్డి కృష్ణారెడ్డి, దుద్యాల వెంకటరెడ్డి, తోకల ఆవులయ్య, కేశయ్య, యేర్వ శేషసేనారెడ్డి, పాలగిరి రామాంజనేయరెడ్డి, షేక్ బుజ్జి, పెద్దదోర్నాల మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకటరమణారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గుమ్మా ఎల్లేష్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి డి.రసూల్, మొద్దు తిరిపతిరావు, వెంకటరామయ్య, పిక్కిలి కాశీరావు పాల్గొన్నారు.

వేడుకలు సరే..వేతనమేది..?

● పాస్టర్లపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
● ఆరు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వని ప్రభుత్వం
● సెమీ క్రిస్మస్ వేడుకల పేరుతో పాస్టర్లను ఏమార్చే ప్రయత్నం
● వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నెలకు రూ.5 వేల గౌరవవేతనం
● ప్రభుత్వం తీరుపై పాస్టర్ల మండిపాటు

దర్శి: సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగించింది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం సంక్షేమం మాటే మర్చిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలన్నింటినీ అటకెక్కించింది. పాస్టర్లకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందించింది. ఈ వేతనం పాస్టర్ల జీవనభృతికి అండగా ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారి జీవనభృతిపై వేటు వేసింది. ఆరు నెలలుగా పాస్టర్లకు పైసా కూడా ఇవ్వలేదు. దీంతో వారంతా గౌరవ వేతనం అందుతుందా లేని ఆశగా ఎదురు చూస్తున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొనైనా గౌరవ వేతనం అందుతుందని పాస్టర్లు ఎంతో భావించారు. కానీ ప్రభుత్వం మాత్రం ఆ మాటే ఎత్తే లేదు.

గౌరవ వేతనం కోసం ఎదురుచూపులు

జిల్లాలో సుమారు నోటిఫైడ్ , నాన్ నోటిఫైడ్ చర్చిలు 4500 ఉండగా వాటిల్లో 4900 మంది పాస్టర్లు ఉన్నారు. దర్శి నియోజకవర్గంలో 350 చర్చిలు ఉండగా 380 మంది వరకు పాస్టర్‌లు ఉన్నారు. వీరంతా చర్చిల్లో దైవ సందేశం అందిస్తారు. వీరిలో అధిక శాతం మంది పేదలే ఉంటారు. చర్చిల్లో వచ్చే కానుకలే వీరి జీవనభృతి. దీంతో వీరికి అండగా ఉండేందుకు గత ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ వేతనం అందిందించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఠంచన్‌గా జీవనభృతి అందింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పైసా కూడా ఇవ్వకుండా పాస్టర్లను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రస్తుతం క్రైస్తవులకు ఎంతో ముఖ్యమైన క్రిస్మస్ పండుగ దగ్గర పడుతున్న సమయంలో పాస్టర్లంతా గౌరవ వేతనం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల పేరుతో ఏమార్చే ప్రయత్నం..

క్రిస్మస్ పండుగ దగ్గర పడుతుండటంతో సెమీ క్రిస్మస్ వేడుకల పేరుతో కూటమి నేతలు పాస్టర్లను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ పాస్టర్లు మాత్రం ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. వేతనం ఇవ్వకుండా ఇలా సెమీ క్రిస్మస్ పేరుతో మమ్మల్ని మభ్యపెట్టాలని చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి



పాస్టర్‌లకు ఇచ్చే గౌరవ వేతనం వారి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుంది. కుటుంబ పోషణకు ఆ డబ్బుతో సర్దుకొని భక్తులు ఇచ్చే కానుకలు ఇతర అవసరాలకు ఉపయోగపడతాయి. క్రిస్మస్ పండుగకైనా పాస్టర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి.

– గుంటూరి కృపానందం, దర్శి గ్రేస్ పాస్టర్స్ డవలప్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షుడు

గౌరవవేతనం నిలిపివేయడం మంచి పద్ధతి కాదు



మా లాంటి పేద పాస్టర్లపై కక్ష సాధింపు తగదు. అందరి ఓట్లు కావాలని కోరుకున్నప్పుడు అందరికీ న్యాయం చేయాలి. ప్రార్థనలు చేసుకుని జీవనాధారం చేసుకునే మాపై ఎందుకు ఈ కక్ష. ప్రభుత్వం ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి. పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి.

– జి.ఏసుదాసు, దర్శి పాస్టర్స్ ఫెయిర్ ఫెలోషిప్ గౌరవ సలహాదారుడు

పాస్టర్లకు చంద్రబాబు తీరని అన్యాయం



చంద్రబాబుకు పాస్టర్‌లపై గౌరవం లేదు. గౌరవం ఉన్న వ్యక్తి అయితే గౌరవ వేతనం ఎందుకు తీసివేస్తారు. క్రైస్తవులను మభ్య పెట్టడం కోసమే సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. దళితులు, దళిత క్రైస్తవుల సంక్షేమం పట్ల చంద్రబాబుకు చిత్త శుద్ధి లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఠంచన్‌గా నెలకు రూ.5 వేల గౌరవ వేతనం అందింది.

– గాలిముటి దేవ ప్రసాద్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి

● వివిధ పార్టీల నేతల డిమాండ్


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సోమయ్య

మార్కాపురం: ప్రభుత్వ నిర్వహణలో మార్కాపురంలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, డాక్టర్ల బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని వివిధ పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పార్టీ నాయకుడు సోమయ్య మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రకాశం కేంద్రంగా ఉన్న మార్కాపురంలో నిర్మాణం జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడాన్ని ఖండించారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ల బదిలీ చేయడాన్ని వ్యతిరేకించారు. 70 శాతం పూర్తయిన నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేయడాన్ని, డాక్టర్ల బదిలీలను చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, సీపీఐ జిల్లా నాయకుడు అందె నాసరయ్య మాట్లాడుతూ మెడికల్ కళాశాల రాక ముందు జిల్లా వైద్యశాల జీజీహెచ్‌గా మారకముందు రోజుకు 300 ఓపీ ఉండేదని, అయితే మెడికల్ కళాశాల నిర్మాణం కావడం జీజీహెచ్‌గా మారి స్పెషలిస్టు డాక్టర్లను నియమించడంతో రోజుకు సుమారు 700 ఓపీ వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ జపం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానం పేరు చెప్పి అసలుకే మోసం చేసిందన్నారు. ఇలా చేస్తే పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్యం దూరమవుతుందన్నారు. జిల్లా మెడికల్ కాలేజీ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు తమ వైఖరి తెలపాలన్నారు. ప్రజలతో కలిసొచ్చే పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డికి వినతిపత్రం అందించారు. సమావేశంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ రజాక్, ఆమ్‌అద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు, యూటీఎఫ్ నాయకులు ఓ వీరారెడ్డి, సీఐటీయూ, సీపీఎం, ఏఐటీయూసీ నాయకులు రూబెన్, రెహానా, కాశయ్య, ఎస్‌కే కాశీం, వీసీకే పార్టీ నాయకులు రాజు, పెద్దన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టు బస్సును ఢీకొన్న కారు

● శ్రీశైలం రోడ్డులో ఘోర ప్రమాదం
● శ్రీశైల దేవస్థానం వైద్యశాలకు చెందిన స్టాఫ్ నర్స్ మృతి
● ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడిన భర్త, కుమార్తె


శ్రీశైలం రహదారిలో సంఘటనా స్థలం


మృతి చెందిన మురహరి మల్లిక


గాయాలతో చిన్నారి జోషిక

పెద్దదోర్నాల: టూరిస్ట్ బస్సును కారు వేగంగా ఢీకొన్న ప్రమాదంలో శ్రీశైలం దేవస్థానం వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న మహిళ మృతి చెందగా, ఆమె భర్త, ఐదేళ్ల కుమార్తెలు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన శ్రీశైలం రహదారిలోని నల్లవాగు వంతెన సమీపంలో ఆదివారం జరిగింది. ఈ సంఘటనలో నంద్యాల జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చెందిన మురహరి మల్లిక (36) మృతి చెందగా, ఆమె భర్త మురహరి బాబూరావు, కుమార్తె జోషికలు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలు దేవస్థానం వైద్యశాలలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తుండగా, ఆమె భర్త బాబూరావు ఏపీ ట్రాన్స్‌కో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేసే లోపే మురహరి మల్లిక మృతి చెందగా, గాయపడిన తండ్రి, కుమార్తెలకు వైద్య పరీక్షలు చేశారు.

ప్రాణాలు కాపాడిన ఎయిర్ బ్యాగులు

బస్సు ఢీకొన్న వెంటనే కారులోని ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో బాబూరావు, కుమార్తె జోషికలు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బాబూరావు కారు నడుపుతుండగా కుమార్తె జోషిక తండ్రి పక్కనే ముందు సీట్లో కూర్చొని ఉంది. ప్రమాద సమయంలో కారు ముందుగా వెళ్తున్న బస్సును బలంగా ఢీకొట్టడంతో కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో వారు స్వల్ప గాయాలయ్యాయి. వెనుక సీట్లో కూర్చున్న మల్లిక తల ముందు సీటుకు కొట్టుకోవడంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు.

పండుగకు ముందే విషాదం.

పండుగ కోసం కర్నూలులో ఎంతో ఆనందంగా దంపతులు షాపింగ్ చేశారు. కానీ బస్సు రూపంలో మృత్యువు ఎదురు పడటంతో ఆ దంపతులకు తీరని ఎడబాటు మిగిల్చింది. కర్నూలులో షాపింగ్ చేసిన తరువాత కారులో కర్నూలు నుంచి బయలుదేరి మరో గంటలో శ్రీశైలంలోని ఇంటికి చేరుకుంటామనుకున్న తరుణంలోనే ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో చిన్నారి జోషిక తల్లిని కోల్పోయింది. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసుకున్న ఇన్‌చార్జి ఎస్సై అనిల్‌కుమార్ సంఘటనా స్థలిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం


టైర్ ఊడిపోయిన బస్సు

పామూరు: ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు నుంచి పామూరుకు వచ్చి తిరుగు వెళుతుంది. ఆ సమయంలో పామూరు దాటిన తరువాత ఓ పాలకేంద్రం సమీపానికి వెళ్లే సరికి బస్ ఎడమవైపు ముందు టైర్ ఒక్కసారిగా డ్రమ్‌తో సహా ఊడి పక్కకు పడిపోయింది. డ్రైవర్ అప్రమత్తతో పాటు బస్ నెమ్మదిగా వెళ్తుండటంతో బస్సులోని 20 మంది ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి


క్యారమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ రాష్ట్ర స్థాయి అండర్ 14,17,19 బాల బాలికల స్కూల్ గేమ్స్ ఎంపికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు తెలుస్తాయన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా అమరావతిలో స్టేడియం నిర్మిస్తామని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖలో ఆగిన స్పోర్ట్స్ మీట్‌ను తిరిగి ప్రారంభిస్తామని, దీనికి రూ.కోటి మంజూరు చేశారన్నారు. సింగరాయకొండలో రూ.95 లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామన్నారు. దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో విశాఖపట్నంలో రూ.200 కోట్లతో నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు పేర్కొన్నారు. పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి స్వామి క్రీడా జ్యోతిని వెలిగించి క్యారమ్స్ పోటీలకు రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. సర్పంచ్ ఎస్ చంద్రశేఖర్, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ గేమ్స్ పరిశీలకుడు స్వర్ణరాజు, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎండీ హజీరాబేగం, ఎంఈఓ శ్రీనివాసరావు, సీఐ సీహెచ్ హజరత్తయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో విజేత ఉమ్మడి ప్రకాశం

జే.పంగులూరు: రాష్ట్రస్థాయి ఖోఖో విజేతగా ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు నిలిచింది. ఈ నెల 20,21,22 తేదీల్లో తిరుపతి జిల్లా పుత్తూరులో అండర్-19 బాలుర స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రథమ స్థానం సాధించింది. ఫైనల్లో ప్రకాశం జిల్లా ఖోఖో బాలుర జట్టు చిత్తూరు జిల్లా జట్టుతో తలపడగా రెండు విన్నింగులు కలిసి 10 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా పీడీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు గత 24 ఏళ్ల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు వస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రథమ స్థానం సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రథమ స్థానం సాధించిన బాలురు జట్టుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదగా కప్, పతకాలు అందిచారు.


ప్రథమ స్థానం సాధించిన ప్రకాశం బాలుర జట్టు